క్లుప్తంగా

వారాహి నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం



ఏలూరు (ఆర్ఆర్ పేట) : స్థానిక సత్రంపాడు శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆషాఢ శుద్ధ పాడ్యమి పర్వదినం సందర్భంగా శనివారం శ్రీ వారాహి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీచక్ర అభిషేకం, అనంతరం సహస్రనామార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం 6.30 గంటలకు భక్తులచే సామూహికంగా కుంకుమ పూజ, అనంతరం పంచహారతులు, వేద మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేశారు.

డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించాలి



కలెక్టర్ వెట్రిసెల్వికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల జరిగిన ఎన్నికల్లో పీఓ, ఏపీఓ, ఓపీఓలుగా విధులు నిర్వహించిన సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు, ఎన్నికల తరువాత మూడో రోజుకు కూడా డీఏ ఇవ్వాలని ఏపీటీఎఫ్ నాయకులు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని కోరారు. వారు శనివారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి ఉపాధ్యాయులు కూడా కృషి చేయాలని కలెక్టర్ సూచించారని నాయకులు పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు బీఏ సాల్మన్ రాజు, టి.రామారావు, బి.రెడ్డి దొర, ఉపాధ్యక్షుడు ఎస్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత ప్రసాదరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శనివారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. ఏలూరులోని పోణంగికి చెందిన పి.ప్రసాదరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

రామానగర్‌లో తాగునీటి కష్టాలు

- పాడైన బోరు, పట్టించుకోని అధికారులు
- 200 కుటుంబాలకు అవస్థలు



గోదావరి జలాలు అందించాలని డిమాండ్ చేస్తున్న రామానగర్ మహిళలు



రామానగర్‌లో పాడైన బోరు



దాతలు సరఫరా చేస్తున్న నీటిని పట్టుకుంటున్న మహిళలు

ఏలూరు రూరల్ : ఏలూరు నగర కార్పొరేషన్ రెండో డివిజన్ రామానగర్‌లో 200 కుటుంబాల ప్రజలు తాగునీరు కోసం అవస్థలు పడుతున్నారు. దాతల సరఫరా చేస్తున్న వాటర్ ట్యాంకుల వద్ద నీటి కోసం పడిగాపులు పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలు వెంకటాపురం పంచాయతీ పరిధిలో ఉన్నప్పుడు బోరు నీరు సరఫరా చేశారు. మూడేళ్ల క్రితం ఈ పంచాయతీ కార్పొరేషన్‌లో విలీనమైంది. దీంతో కార్పొరేషన్ అధికారులు స్థానిక ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి బోరు నీరు సరఫరా చేస్తున్నారు. ఎన్నోఏళ్ల క్రితం వేసిన బోరు నాలుగు రోజుల క్రితం పూడుకు పోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. పాడైన బోరు స్థానంలో కొత్తబోరు వేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. ఈ చర్యలు నత్తనడకన సాగుతుండడంతో తమకు నీటి కష్టాలు ఏర్పడ్డాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గోదావరి నీరు అందించాలి

బోరునీటి స్థానంలో శుద్ధి చేసిన గోదావరి జలాలు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు. బోరు నీటిలో సుద్ద శాతం ఎక్కువగా ఉండడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్థానిక భూలోకమ్మ తల్లి గుడి పరిసరాల ప్రాంతాలకు పైప్ లైన్ ద్వారా గోదావరి నీటిని సరఫరా చేస్తున్నారని గుర్తు చేశారు. అక్కడ నుంచి రామానగర్ వరకు కొత్త పైప్‌లైన్ వేసి గోదావరి నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

సుద్దనీరు వస్తోంది

రామానగర్ బోరు నుంచి సుద్ద నీరు వస్తోంది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఇప్పుడు పాడైన బోరు స్థానంలో కొత్త బోరు వేస్తామంటున్నారు. కొత్త బోరు నుంచి కూడా సుద్ద నీరే వస్తుంది. ఆ నీరు తాగడం వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడతాయి. ప్రతిఏటా బోరు పాడౌతుంది. వేసవికాలంలో అయితే మరిన్ని కష్టాలు, వాడుక నీరు సైతం లేక అవస్థలు పడుతున్నాం. – అరుణకుమారి, రామానగర్ వాసి

గోదావరి జలాలు అందించాలి

మాకు గోదావరి జలాలు అందించాలి. స్థానిక భూలోకమ్మ గుడి పరిసరాల ఇళ్లకు గోదావరి జలాలు సరఫరా చేస్తున్నారు. అక్కడ నుంచి 100 మీటర్ల దూరం ఉన్న రామానగర్‌కు పైప్‌లైన్ వేయాలి. అప్పుడే ఈ ప్రాంతంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి సురక్షిత తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలి. – చంద్రశేఖర్, రామానగర్ వాసి

బిషప్ జయరావు సేవలు చిరస్మరణీయం



బిషప్ జయరావును కలిసిన బ్యాంక్ డైరెక్టర్ నాగేశ్వరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు మేత్రాసనం పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు సేవలు చిరస్మరణీయమని గాంధీ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కల్లె నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక గ్జేవియర్ నగర్లోని బిషప్ హౌస్‌లో బిషప్ జయరావును ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఏలూరు బిషప్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి జయరావు పేద వర్గాలను ఆదుకోవడానికి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో, అలాగే వరదలు, అగ్ని ప్రమాదాలు వంటి ఆపద సమయాల్లో బాధితులను అక్కున చేర్చుకుని వారికి అండగా ఉన్నారని గుర్తుచేశారు. బిషప్ సేవలు మరింత కాలం కొనసాగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఏలూరులో దోమల నివారణ చర్యలు



దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్ : ఏలూరులో దోమల నిర్మూలన చర్యలు చేపట్టామని కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ తెలిపారు. యాదవనగర్-2 సచివాలయ పరిధిలో బడేటి నగర్ ప్రాంతంలో నీటినిల్వ ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్, మురుగుకాలువల్లో ఎబెట్ ద్రావణం పిచికారీ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చొదిమెళ్ల, రాజరాజేశ్వరి నగర్, సపోటాతోట, యాదవ్‌నగర్, బడేటినగర్ తదితర ప్రాంతాల్లో దోమలు, దోమ లార్వాలను నిర్మూలనకు ఆయిల్‌బాల్స్ వేస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో విష జ్వరాలు వ్యాప్తి చెందుతాయని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్ర పాటించాలని సూచించారు. అతిసార వ్యాధి నివారణకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలన్నారు. నగర హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి మాట్లాడుతూ దోమకాటుతో అనేక ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డేగా పాటించాలని సూచించారు. ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ డెంగీ వ్యాధి కారకమైన ఈజిప్ట్ ఏడిస్ అనే ఆడదోమ కాటు నుంచి ప్రజలు దూరంగా ఉండేందుకు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బడేటి నగర్, మట్టలకోనేరు ప్రాంతాల్లో నీటి నిల్వల్లో ఆయిల్‌బాల్స్ వేయటంతోపాటు, ఫాగింగ్ కార్యక్రమం చేపట్టారు. ప్రజలకు దోమల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్లు వేణు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంజయ్, వినోద్, హెల్త్ అసిస్టెంట్ మేడ శ్రీనివాసరావు, దుర్గారావు, ఆరోగ్య కార్యకర్త విజయశ్యామల, ఆశా కార్యకర్త రాజేశ్వరి, ప్రమీళ, నగరపాలక సిబ్బంది ఉన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ



మాట్లాడుతున్న పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ మేరీగ్రేస్ కుమారి

ఏలూరు (టూటౌన్): వాహన ప్రమాదాల నివారణకు ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పర్మినెంట్ లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి సూచించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అధ్యక్షతన శనివారం వాహన ప్రమాదాలు నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణ నష్టాన్ని నివారించవచ్చన్నారు. కుటుంబ యజమాని ప్రమాదంలో మరణిస్తే కుటుంబం మొత్తం అనాథలవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులికృష్ణ, పలువురు న్యాయవాదులు, వాహనచోదకులు పాల్గొన్నారు.

దళితుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్



ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళి

ఏలూరు (టూటౌన్) : నిమ్నజాతుల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడి, 50 వసంతాలు పైబడి దేశ రాజకీయాల్లో కొనసాగిన జాతీయ అగ్ర నేత, భారత దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ గొప్ప సంఘసంస్కర్త, దళితుల ఆశాజ్యోతి అని పలువురు నాయకులు కొనియాడారు. బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఏలూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయనకు వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ ఆధ్వర్యంలో స్థానిక ఓవర్‌బ్రిడ్జి కింద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగాన్ని అమలు చేసిన ఘనత బాబూ జగ్జీవన్ రామ్‌కే దక్కుతుందని కొనియాడారు. సుదీర్ఘంగా పార్లమెంట్ వ్యవస్థలో కొనసాగి ప్రపంచ రికార్డు సృష్టించిన వ్యక్తి జగ్జీవన్ రామ్ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ సంఘాల నాయకులు ఉక్కుసూరి గోపాల కృష్ణ, కిలారపు బుజ్జి, ఆలమండ రామారావు, చిట్టిబోయిన సాయిబాబా, మేతర అజయ్ బాబు, దేవరపల్లి రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధిద్దాం

ఎస్సీ, ఎస్టీ, బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ డెవలప్‌మెంట్ చైర్మన్ మేతర అజయ్‌బాబు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేకూరి ఆశీర్వాదం, చౌటపల్లి శ్రీనివాసరావు, పొలిమేర సురేష్, నేదూరి సాయి, రామకృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బీజేఆర్ యూత్ ఆధ్వర్యంలో..

భారత ప్రధాని అవ్వాల్సిన తరుణంలో నాటి కుటిల రాజకీయాల కారణంగా డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ ఉప ప్రధాని పదవితో సరిపెట్టుకోవాల్సి వచ్చిందని జాతీయ సీనియర్ దళిత నేత,రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొలిమేర హరికృష్ణ అన్నారు. స్థానిక 46వ డివిజన్ కబడ్డీగూడెంలో జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద బీజేఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్సీ నాయకులు కాకాని వెంకటేశ్వరరావు, జిల్లా చర్మకారుల సంఘం కార్యదర్శి ఉండి నాగేశ్వరరావు, యువ నాయకులు సుధాకర్, ప్రసాద్‌లు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్‌లు దళిత వర్గాలకు రెండు కళ్లు వంటి వారని అన్నారు. కార్యక్రమంలో జొన్నకూటి రవి, పొలిమేర సురేష్, చింతాటి వెంకన్న, ముల్లుల రమేష్, కటారి విజయ్, బీజేఆర్ యూత్ తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు



కబడ్డీగూడెంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	22
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	12
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	09
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	03
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	19
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	10
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	12
ఏలూరు - తిరుపతి	16.00	4830	28

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	10, 15
బెండకాయలు	28	కంద	64
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	38
కాకర కాయలు	48	కీరా దోస	44
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	108
బీరకాయలు (పందిరి)	44	అల్లం	180
క్యాబేజీ	42	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-48	పాలకూర	12
దొండకాయలు	24	చుక్కకూర	12
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	54	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	52

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి వ్రతం



శ్రీవారి వ్రతంలో పాల్గొన్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి జానకీ రామాంజనేయ గౌరీశంకర సాయి మందిరంలో ఏడు వారాల శ్రీ వేంకటేశ్వర స్వామి వ్రత కార్యక్రమం శనివారం భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. గోవిందనామస్మరణ, విష్ణుసహస్రనామ పారాయణ చేశారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు నిర్వహించి, స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో తొలి శనివారం సామూహిక వ్రతాలు ఆచరించారు. స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా కమిటీ ప్రతినిధి వెన్నెలకోట లత మాట్లాడుతూ ఆలయంలో ఏడు వారాల పాటు కుటుంబ సమేతంగా ఏడు ప్రదక్షిణలు చేసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటే శుభం కలుగుతుందని చెప్పారు. అర్చకుడు ప్రకాశాచార్యులు విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో కోలా భాస్కరరావు, గొంతిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు

పెదపాడు: కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు ఉంటే ప్రభుత్వం నుంచి లభించే రాయితీలు పొందవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకా తప్పనిసరి



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణయ్య

ఏలూరు (టూటౌన్): పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఎమ్మెల్యే బడేటి చంటి కోరారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఏలూరు పశువైద్యశాల ఆవరణలో పశుసంవర్ధక శాఖ జేడీ జి.నెహ్రూబాబు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన రేబిస్ వ్యాధి రాకుండా ఉచితంగా వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జంతు ప్రేమికులు తమ జంతువులకు వ్యాక్సిన్ వేయించి రేబిస్ వ్యాధికి గురికాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ జేడీ నెహ్రూబాబు మాట్లాడుతూ 330 శునకాలకు ఉచితంగా టీకాలు వేశామన్నారు. ఆదివారం కూడా టీకాలు వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా సహాయ సంచాలకుడు పి.సుబ్రహ్మణ్యం, ప్రాంతీయ పశువైద్యశాల ఏలూరు, అదనపు సహాయ సంచాలకులు ఎ.సుచరిత, పశువైద్యశాల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బీఎస్‌వీపీ కిరణ్, టీఎంఎస్ హైమా, ఎం.లక్ష్మి, పి.రంగనాథ్, ఎస్‌వీఎస్ విజయశ్రీ ప్రాంతీయ పశువైద్యశాల ఏలూరు సిబ్బంది, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ జీవితం ఆదర్శం



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : బీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జీవితాన్ని ప్రతి కార్యకర్తా ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్ పిలుపునిచ్చారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం స్థానిక అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ గాది రాంబాబు అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలతో అలంకరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏలూరు పార్లమెంటు కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దానభాస్కరరావు, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు అదపాక నాగ సురేష్, ఇలపకుర్తి భానుప్రకాష్, మారుబరిక శ్రీనివాస్, నాగం శివ, చెరుకూరి గణపతి, అజ్జాడ అప్పారావు, అగ్రహారపు వెంకటేశ్వరరావు, చెన్నకేశుల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ప్రపంచ జ్ఞానం

దెందులూరు: పుస్తక పఠనం మానవ సంబంధాల విలువ, జీవన విధానం, ప్రపంచ జ్ఞానాన్ని తెలియజేస్తుందని నూజివీడు డీఎస్పీ జి. లక్ష్మయ్య అన్నారు. శనివారం పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో జీవిత సత్యాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను యువతకు ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏళ్ల నుంచి యువతకు, పాఠశాల విద్యార్థులకు పుస్తక పఠనాన్ని అలవాటు చేసే ప్రక్రియలో భాగంగా పుస్తకాలు అందజేస్తున్నానని అన్నారు.

వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తం

పెదపాడు: మండల స్థాయి అధికారులంతా అప్రమత్తతో వ్యవహరించాలని పెదపాడు తహసీల్దార్ వి భావన్నారాయణ తెలిపారు. పెదపాడు మండల తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో సంభవించే ప్రకృతి వైపరీత్యాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.